
ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025 5 విజయనగరం



'ఉగ్ర' లింకులపై ఆరా?


ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరంలో 'ఉగ్ర' లింకులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విజయనగరంలోని అబాద్‌వీధికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్ అరెస్టవడంతో ఉగ్రవాద లింకులపై విచారిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో పేలుళ్లకు సిరాజ్, సమీర్ కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో బయటపడినట్లు చర్చించుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌తో వీరిద్దరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిరాజ్ ఎవరెవరితో లింకులు ఏర్పాటు చేసుకుని కుట్రలకు పాల్పడ్డాడనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. పెహల్గాంలో ఉగ్రవాదులు దాడి అనంతరం, మన దేశంలోని 290 ముఖ్య ప్రాంతాలు, 240 ప్రాంతాలపై ఉగ్రవాదులు టార్గెట్ చేసినట్లు గుర్తించిన విషయం విదితమే. ఈ ప్రాంతాలపై సమాచారం ఇవ్వడంలో వీరిద్దరి పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సిరాజ్ తండ్రి, సోదరుడు పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తుండటం గమనార్హం.

అభం.. శుభం తెలియని చిన్నారులు.. మంచి చెడు అంటే ఏమీ తెలియదు వారికి... వేసవి సెలవుల్లో ఆటే ప్రపంచమనుకున్నారు.. సరదాగా కారు ఎక్కుదామని భావించారు.. ఆ కారే వారిని మృత్యుఒడిలోకి లాక్కెళుందని గ్రహించలేకపోయారు.

వచ్చీ రాని ఆంగ్ల పదాలతో తల్లిదండ్రులను మురిపించేవారు. వారి నోటి వెంట వచ్చే ఆణిముత్యాల్లాంటి మాటలు విని తల్లిదండ్రులు కూడా ఎంతో సంబరపడేవారు. ఆ మాటలు ఇంకొన్నేళ్లపాటు వింటామని తల్లిదండ్రులు భావించారు. వారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో గానీ.. కారు రూపంలో వచ్చి చిన్నారులను పొట్టన పెట్టుకుంది. చిన్నారుల తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేసింది. మూడు కుటుంబాలకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది.

ఈ హృదయ విదారకర సంఘటన విజయనగరం మండలం ద్వారపూడిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...



మృతిచెందిన చిన్నారులు

చిన్నారులను కబళించిన మృత్యువు

- కారులో ఊపిరాడక నలుగురు పిల్లలు మృత్యువాత
- ద్వారపూడిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలోని బిసి కాలనీలో కంది సురేష్, అరుణ దంపతులు నివాసం ఉంటున్నారు. కంది సురేష్‌కు మనీశ్వరి (7) కుమార్తె ఉంది. సురేష్ జెఎన్‌టియు దగ్గర ఉన్న ఎఫ్‌సిఐ గోదాం సమీపంలో కళాసీగా పని చేస్తున్నాడు. అదే కాలనీకి చెందిన బూర్లి ఆనంద్, ఉమామహేశ్వరి దంపతులకు కుమార్తెలు చారులత(7), జాశ్రిత (8) ఉన్నారు. ఆనంద్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. అదే కాలనీలో మంగి బుచ్చినాయుడు, భవాని దంపతులు కూడా నివాసం ఉంటున్నారు. బుచ్చినాయుడుకు మంగి ఉదయ్ (7) కుమారుడు ఉన్నాడు. మూడు కుటుంబాలూ పక్కపక్కనే నివశిస్తున్నాయి. ఆ తరుణంలో మనీశ్వరి, చారులత, జాశ్రిత, ఉదయ్ మంచి స్నేహితులయ్యారు.



రోదిస్తున్న చారులత, జాశ్రిత తల్లి ఉమామహేశ్వరి

అదే గ్రామంలో ఆదివారం రెండు శుభాకార్యాలు జరుగుతున్నాయి. చిన్నారులు నలుగురూ కలిసి ఆడుకుందామని ఇళ్ల నుంచి బయల్దేరారు. సమీపంలోని నీళ్ల ట్యాంకు వద్ద కారు ఆగి ఉంది. ఆ కారు డోర్ అన్‌లాక్ చేసి ఉండడంతో చిన్నారులు నలుగురు సరదాగా ఆడుకోవడానికి కారులోకి వెళ్లారు. ఇంతలో కారు డోర్ లాక్ పడటంతో చిన్నారులు అందులో చిక్కుకొన్నారు.

ఉదయం సుమారు 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన చిన్నారులు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఊరంతా వెతికారు. సాయంత్రం సమయంలో స్థానికులు కారులో ఉన్న నలుగురు చిన్నారులను చూసి, కారు అద్దాలు పగలకొట్టి బయటకు తీశారు. ద్విచక్ర వాహనాలపై విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారులు నలుగురు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి తరలివచ్చారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణమంతా ద్వారపూడి గ్రామస్తులతో నిండిపోయింది. గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు మృతి చెందడంతో ద్వారపూడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందులోనూ నలుగురూ బిసి కాలనీకి చెందిన వారు కావడంతో ఈ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు.



చిన్నారులు మరణించింది ఈ కారులోనే

వారసులే లేరు



- మృతి చెందిన నలుగురు చిన్నారుల్లో బూర్లి ఆనంద్ కుమార్తెలు చారులత, జాశ్రిత ఉన్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఇద్దరు కుమార్తెలు విగతజీవులుగా పడి ఉండటంతో ఆ దంపతులు బోరున విలపించారు. ఇద్దరు పిల్లలు మృత్యువాత పడటంతో వారసులు లేకుండా పోయారు.
- కంది సురేష్ కుమార్తె మునీశ్వరి మృతదేహాన్ని చూసి, కన్నీరుమున్నీరయ్యాడు. శనివారమే బొండపల్లి మండలంలోని గరుడబిల్లిలోని అత్తవారింటి నుంచి మనీశ్వరి తీసుకువచ్చానని, ఇంతలోనే ఇలా మృత్యువాత పడిందని వెక్కివెక్కి ఏడ్చాడు. సురేష్‌కు కూడా మనీశ్వరి ఒక్కరే కుమార్తె కావడంతో వారసురాలు లేకుండా పోయింది.
- మంగి బుచ్చినాయుడుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఉదయ్ మృత్యువాత పడడంతో వారసుడు లేకుండా పోయాడు. దీంతో బుచ్చినాయుడు కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కారు ఓనర్ నిర్లక్ష్యమా?

ద్వారపూడి గ్రామంలో నలుగురు చిన్నారుల మృతికి కారు యజమాని నిర్లక్ష్యమే కారణంగా గ్రామస్తులు చెబుతున్నారు. కారు డోర్ లాక్ వేసి ఉంటే నలుగురు చిన్నారులు మృతి చెందే వారు కాదని అంటున్నారు. కారు గ్రామానికి చెందిన ఒక వ్యక్తిదని చెబుతున్నారు.



ఘటనపై ఆరాతీస్తున్న మంత్రి శ్రీనివాస్

మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ



రోదిస్తున్న మనీశ్వరి తండ్రి

చిన్నారుల మరణ వార్త తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదివారం రాత్రి ఆస్పత్రి వద్దకు చేరుకుని, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ద్వారపూడి గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నరసింగరావు, వైస్ సర్పంచ్ వెన్నె శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బూడి ప్రవీణ్‌కుమార్, గ్రామ నాయకులు.. జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు.

జెడ్‌పి చైర్మన్ దిగ్భ్రాంతి

నలుగురు చిన్నారుల మృతి పట్ల జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్నారుల మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆ కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.

అధికార పార్టీల్లో.. గ్రూపుల గోల

- పట్టు బిగించేందుకు కొందరు.. సడలించేందుకు మరికొందరు
- ప్రజా సమస్యలు గాలికొదిలేశారని సర్వత్రా విమర్శలు

జిల్లాలోని అధికార పార్టీల(కూటమి)లో గ్రూపుల గోల ఎక్కువైందని సర్వత్రా చర్చ నడుస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలు సొంత వ్యవహారాల్లో మునిగి తేలుతూ ప్రజా సమస్యలు గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు తమ సమస్యలను పట్టించుకోవడం మానేశారని జనం చర్చించుకోవడం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. పరిస్థితి ఇలానే ఉంటే టిడిపి, జనసేన పార్టీల పట్టు సడలే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని కూడా నియోజకవర్గంలోని కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా రాజకీయ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే.. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాలన, అధికార పార్టీల నాయకులు, ఎమ్మెల్యేల పనితీరుపై చర్చ మొదలైంది. ఇందులో సీనియర్లంతా ఉన్నారని చర్చ నడుస్తోంది. ఇందుకు తగ్గట్టే విజయనగరం, గజపతినగరం, రాజాం ఎమ్మెల్యేలతోపాటు ఎంపి ఓ వైపు, బొబ్బిలి, చీపురుపల్లి, శృంగవరపుకోట ఎమ్మెల్యేలు మరోవైపు ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా ఉంటున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం గజపతినగరం ఎమ్మెల్యే ఎలాగూ మంత్రిగా ఉన్నారు. విజయనగరం ఎమ్మెల్యే.. మంత్రి కాకపోయినా అధినేతలతో రాజకీయ సంబంధాల వల్ల ఆమె కూడా అదే స్థాయిలో వ్యవహారాలు అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వ కార్యకలాపాల్లోనూ జోక్యం చేసుకుంటున్నారు. రాజాం ఎమ్మెల్యే పార్టీలో చేరినప్పటి నుంచి విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తండ్రి, టిడిపిలో క్రియాశీలక నేత పూసపాటి అశోక్ గజపతిరాజుతో సన్నిహితంగా ఉంటున్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు.. అశోక్ ఎంత చెబితే అంత, ఏం చెబితే అదే అన్నట్టుగా ఉంటారు. ఉంటున్నారు కూడా. సీనియర్లుగా ఉంటూ మంత్రి పదవి దక్కలేదన్న బాధతో చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఉన్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న బేబినాయన కూడా అప్పట్లో ఆశపడి భంగపడిన వారి జాబితాలో ఉన్నారు. ఈ లెక్కన ఈ ఆరుగురు పైకి ఐక్యంగా ఉన్నప్పటికీ, లోలోపల రెండు గ్రూపులుగా ఉంటున్నారనే చర్చ బహిరంగంగానే నడుస్తోంది. ఇక నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి.. కూటమి ధర్మాన్ని పక్కనపెట్టి అంతా జనసేన అన్నట్టుగా పాలన, రాజకీయం నడుపుతున్నారు. ఈ విషయాలను కాస్త పక్కన పెడితే... కొంతమంది ఎమ్మెల్యేలు భవిష్యత్తులో ఆటంకాలను తొలగించుకుంటుండగా, మరి కొంతమంది తమకు ఎదురైన ఆటంకాలను తొలగించుకునేందుకు ఎదురీదాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.



- చీపురుపల్లి ఎమ్మెల్యే తన కుమారుడు రామ్‌మల్లిక్ నాయుడును నియోజకవర్గంలో ప్రతి సందర్భంలోనూ ప్రమోట్ చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో బాగా పట్టున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున హవాను తగ్గించి, మల్లిక్‌కు పార్టీలో తిరుగులేని స్థానంగా కల్పించేందుకు ఎమ్మెల్యే ఇప్పటినుంచే పావులు కలుపుతున్నారని చర్చ నడుస్తోంది.
- శృంగవరపుకోట ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ సహా మరో నేతతో తలనొప్పులు మొదలయ్యాయని టిడిపి కేడర్ చర్చించుకుంటోంది. వీరిద్దరూ విశాఖ ఎంపి గ్రూపులో ఉంటూ ఎమ్మెల్యేను లెక్క చేయడం లేదని కూడా చర్చ నడుస్తోంది.
- బొబ్బిలిలో మకుటం లేని మహారాజుగా ఉన్న బేబినాయనకు స్థానిక నాయకత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులూ లేవు. కానీ, ఈ మధ్య కాలంలో ఇంటిపోరు ఎక్కువైందని, ఆ మధ్య సిఐ నియామకంలో అడ్డుపడటం మొదలుకొని ఇటీవల మున్సిపల్ పాలకవర్గ ఎన్నికల్లో జోక్యం వరకు ఆయన సోదరుడు, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు పాత్ర కీలకంగానే ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.
- విజయనగరం ఎమ్మెల్యే.. స్థానిక టిడిపి నాయకుడు రాజేష్‌వర్మకు మినహా మరెవరికీ ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల ఐవిపి రాజు, గంట పోలినాయుడు గ్రూపులు లోపల రగిలిపోతున్నాయని బంగ్లాలోనే చర్చ నడుస్తోంది.
- గజపతినగరంలో మంత్రి శ్రీనివాస్ పార్టీలో సీనియర్లను పక్కనపెట్టి, ఎన్నికల్లో కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు తనకు నామినేటెడ్ పోస్ట్ ఇవ్వడం లేదని ఒక మండల నాయకుడు, తనపై అధికారుల నుంచి వస్తున్న ఒత్తిడి ఆపడం లేదని మరో మండల నాయకుడు కినుక వహిస్తున్నారని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. ఈ ఇద్దరి మధ్య ఉన్న ఐక్యతా రాగం జిల్లాలోని ఒక పెద్ద అధికారిపై ఫిర్యాదులు చేసే వరకు వెళ్లిందన్న చర్చ కూడా ఉంది. అయితే ఆ ఫిర్యాదును పార్టీ నేత 'లైట్' తీసుకోవడంతో కంగుతిన్నారట.
- రాజాం ఎమ్మెల్యేకు ప్రస్తుతం అలాంటి ప్రతికూల పరిస్థితులు లేనప్పటికీ, పార్టీలో ఆయన వ్యతిరేక గ్రూపు అదును కోసం చూస్తోందని సమాచారం.
- నెల్లిమర్ల ఎమ్మెల్యే.. టిడిపి నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడమే పనిగా పెట్టుకోవడం, ప్రభుత్వ పథకాలు, కార్యకలాపాల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం వంటి పరిస్థితులు.. అదే నియోజకవర్గంలో ఉన్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు సవాల్‌గా మారాయి.
- ఎంపి అప్పలనాయుడు నేల విడిచి సాము చేస్తున్నట్టు నియోజకవర్గంలోని ప్రజా సమస్యల కన్నా, పార్టీ సేవలు, అందులోనూ ఇతర జిల్లాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే అదితి రాజకీయ శిబిరంలో చాలా చురుకుగా ఉంటున్నారు.

మొత్తానికి ఏడాదిలో ఎమ్మెల్యేలు తమకు తాము ఇచ్చుకున్నంత ప్రాధాన్యత ప్రజా సేవకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇవ్వడం లేదనే చర్చ ముమ్మరంగానే సాగుతోంది. ప్రతివారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వేలాదిగా వినతులు వస్తుండటమే అందుకు నిదర్శనమని పలువురు చర్చిస్తున్నారు.

21న విద్యాశాఖా కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు కల్పించి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. పాఠశాలల్లో సమాంతర మీడియం, మైనర్ మీడియం కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడం సరైన పద్ధతి కాదని, అన్ని ఖాళీలను చూపించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి 1:35 గానూ, 45 దాటితే రెండో సెక్షన్ అమలు చేయాలని కోరారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్ల నియామకం సరికాదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని, తదితర డిమాండ్లపై చేపట్టే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వి.రవీంద్ర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, ఆప్టా నాయకులు ఎస్.భాస్కరరావు, సిహెచ్ రాము, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జెఆర్‌సి పట్నాయక్, ఎస్‌టియు నాయకులు కె.జోగారావు, సిహెచ్.సూరిబాబు, ఎపిటిఎఫ్ (1938) నాయకులు డి.ఈశ్వరరావు, శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ (258) నాయకులు పాల్తేరు శ్రీనివాసరావు, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు టి.సన్యాసిరాజు, ఎ.కృష్ణారావు, ఆపస్ నాయకులు ఈ.రామానాయుడు, బి.శ్రీనివాసరావు, పండిత్ పరిషత్ నాయకులు వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'వేసవి వినోదం' ప్రారంభం

ప్రజాశక్తి- విజయనగరం

నగరంలో వేసవి వినోద కార్యక్రమం బాలల సంఘం, గురజాడ విజ్ఞాన కేంద్రం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలి రోజు పిల్లలకు డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, సైకాలజీ యాక్టివిటీస్‌పై వివరించారు.



పిల్లలకు స్టోరీస్ చెబుతున్న ఉపాధ్యాయుడు



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పెళ్లింట తీవ్ర విషాదం

మరికాసేపట్లో కూతురి పెళ్లి.. అంతలోనే తల్లి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

బంధుమిత్రులు.. మేళతాళాలు... మంగళ వాయిద్యాలతో సందడిగా ఉన్న పెళ్లింట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వధువు తల్లి ఒక్కసారిగా గుండెపోటుతో స్పృహ తప్పి కుప్పకూలిపోయింది. ఈ హృదయ విదారకర సంఘటన మండలంలోని పాతభగ్గాంలో చోటుచేసుకుంది.

పాతబగ్గాం గ్రామానికి చెందిన పప్పల పైడమ్మ (50) తన కూతురు గౌరీ వివాహాన్ని ఇంటి వద్ద ఆదివారం వైభవంగా నిర్వహించింది. పెళ్లి ముహూర్తం మరికొంత సమయంలో దగ్గర పడుతుందనే సమయంలో పెళ్లి హడావుడిలో ఉన్న పైడమ్మ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. దీంతో బంధువులు స్థానిక ఆర్ఎంపికి చూపించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించడంతో ఒక్కసారిగా అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వధువు తండ్రి మూడేళ్ల కిందట అనారోగ్యంతో మరణించారు. దీంతో పైడమ్మ కూలి పనులు చేస్తూ ఇంటిని నెట్టుకొచ్చేది. కుమార్తెకు అన్నీ తానై.. కష్టపడి సంపాదించిన డబ్బులు కూడగట్టి... అంగరంగ వైభవంగా పెళ్లి చేసేందుకు సిద్ధమైంది. ఇంతలో ఒక్కసారిగా తల్లి గుండెపోటుతో మృతి చెందడంతో ఆ యువతి గుండెలవిసేలా రోదించింది. పెళ్లికి వచ్చిన బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు.. వధువు కన్నీరు పెట్టడం చూసి చలించిపోయారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

- గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- ప్రయివేటు ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా
- వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలి
- 'ప్రజాశక్తి'తో డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి ముఖాముఖి



జిల్లాలో వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎస్.జీవనరాణి తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో డెంగీ, మలేరియా, జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్ ఖర్చుల వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయాలని చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి డిఎంహెచ్ఒ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...


\- ప్రజాశక్తి, కంటోన్మెంట్

జిల్లాలో ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.?

జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 652 ఆరోగ్య ఉప కేంద్రాలు, 18 అర్బన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజలు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య సేవలు పొందొచ్చు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో హాజరై వైద్య సేవలు అందించాలి.

జిల్లాలో వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జిల్లాలో వ్యాధుల నియంత్రణ అనేక చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు, జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 18 మండలాల్లో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 152 గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాం. గ్రామాల్లో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఇంత వరకు డెంగీ - 23, మలేరియా -183 కేసులు నమోదు అయ్యాయి.



ప్రయివేటు ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సల ఛార్జీల వివరాల నేమ్ బోర్డులు లేవు. అటువంటి ఆస్పత్రులపై చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా.?

జిల్లాలోని అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో వివిధ రకాల శస్త్రచికిత్సలకు సంబంధించిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. వైద్యులు తనిఖీ చేసే ఒపి నుంచి వివిధ రకాల ఆపరేషన్లకు ఎంత ఖర్చు అవుతుందో వివరాలు, ఎక్స్‌రే, స్కానింగ్, ల్యాబ్ టెస్టులు తదితర వివరాలు అందులో పొందుపరచాలి. ప్రయివేటు ఆస్పత్రులను తనిఖీ చేసి, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయని వాటిపై చర్యలు తీసుకుంటాం.

ప్రయివేటు ఆస్పత్రుల్లో డబ్బుల కోసం సాధారణ ప్రసవాలను సైతం శస్త్రచికిత్సలు చేసి డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.?

ప్రయివేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు శస్త్రచికిత్సలు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం నా దృష్టికి రాలేదు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలి. సాధారణ ప్రసవానికి వీలు కానప్పుడు కొన్ని ప్రత్యేక పరిస్థితులను బట్టి శస్త్రచికిత్స చేసి, ప్రసవాలు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో సుమారు 80 మంది ఎఎన్ఎంలు స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొందారు. కానీ స్టాఫ్ నర్సులుగా పోస్టింగ్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.?

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎఎన్ఎంలుగా పనిచేస్తున్న కొంతమందికి స్టాఫ్‌నర్సులుగా శిక్షణ ఇచ్చారు. వారు ఇంకా ఎఎన్ఎంలుగానే ఉన్నారు. రాష్ట్ర కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాగానే స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొందిన అందరికీ పోస్టింగులు ఇస్తాం.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- 21 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలు
- హాజరుకానున్న 2851 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 21 కేంద్రాల్లో ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లా విద్యా శాఖ అధికారులు పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2851 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు 5 కేంద్రాల్లో, ఓపెన్ ఇంటర్ పరీక్షలు మూడు కేంద్రాల్లో జరగనున్నాయి.

సప్లిమెంటరీ షెడ్యూల్

19న మొదటి లాంగ్వేజ్
20న రెండో లాంగ్వేజ్
21న ఇంగ్లీష్
22న గణితం
23న ఫిజికల్ సైన్స్
24న బయోలాజికల్ సైన్స్
26న సోషల్ స్టడీస్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

సోమవారం నుంచి జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకునేందుకు సౌకర్యాలు కల్పించాం. 21 కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటుచేశాం. సకాలంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

\- యు.మాణిక్యంనాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రజాశక్తి
www.prajasakti.com

గజపతినగరంలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్


ర్యాలీలో పాల్గొన్న మంత్రి

ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశ సైన్యం విజయం కీర్తిస్తూ ఆదివారం సాయంత్రం గజపతినగరం చంపావతి బ్రిడ్జి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు మంత్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ జై జవాన్ జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీకి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జనసేన మండల పార్టీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ చేశారు. భారత సైన్యానికి మద్దతుగా జనసేన నాయకులు సత్యారావు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ ర్యాలీ వేపాడ వల్లంపూడి గ్రామాలలో ప్రధాన మార్గంలో నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సైన్యం తమ సత్తా నిరూపించుకుందని అభినందనలు తెలుపుతూ ర్యాలీ ద్వారా సంఘీభావం తెలిపారు.

నేటి నుంచి పైడితల్లమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి గ్రామ దేవత పైడితల్లమ్మ అమ్మవారి పండగ సోమవారం నుంచి రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం తొలేళ్ల, మంగళవారం అనుపు కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ పండగ సందర్భంగా బండి ప్రభలు ఏర్పాటు చేయడం, బంధ వేషాలు, కాంగో నృత్య ప్రదర్శన, మహిళా కోలాటాలు ఏర్పాటు చేశామన్నారు.

జాకేరులో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో శనివారం రాత్రి ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను పొందుతూ చదువుకునే అవకాశం ఇక్కడే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపించి ఉన్నత స్థాయి చదువులకు వెళ్లే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆసందరం బడిఈడు పిల్లలు 12 మందిని గుర్తించి అడ్మిషన్లు చేపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ అప్పల సత్యం, ఆర్ రామసత్యం, బి అప్పారావు, సిఆర్‌పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

నాటు సారా మానండి

ప్రజాశక్తి - కొత్తవలస

నాటు సారా మానండి 'మీ బంగారు భవిష్యత్తుని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకోండి' అని కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ జి.ఎస్ రాజశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం అప్పన్నదొరపాలెం పంచాయతీలో జోడి మెరక, తమన్న మెరక గ్రామాలలో నాటు సారా వల్ల కలిగే అనర్ధాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, కొనినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పాత నాటుసారా వ్యాపారస్తులపై బైండోవర్ చేశామన్నారు. బి కేజగానికి చెందిన జోడిమెరక, తమన్న మెరక గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడిక తీత

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు ఎడమ కాలువలో పూడిక తీత పనులను అధికారులు ఆదివారం చేపట్టారు. ఈనెల 17న ప్రజాశక్తిలో ఖరీఫ్‌కు సాగునీరందేనా..? అనే కథనం ప్రచురణ కావడంతో జిల్లా అధికారులు స్పందించి మడ్డువలస కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడిక తీత పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో ఎడమ కాలువలో ప్రొక్లెన్‌తో పూడికతీత పనులను మడ్డువలస ప్రాజెక్టు అధికారులు చేపట్టారు. డిఇఇ అర్జున్, ఎఇ అనిల్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడి ప్రధాన కాలువలో కూడా పూడికతీత పనులను త్వరలో చేపడతామని వెల్లడించారు. ప్రజాశక్తి కథనానికి స్పందించి ఎడమ ప్రధాన కాలువలో పూడికతీత పనులను చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గజపతినగరంలో మినీ మహానాడు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

స్థానిక ఓ ప్రయివేటు కన్వెన్షన్ హాల్లో ఆదివారం మధ్యాహ్నం టిడిపి మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దివంగత ఎన్‌టిఆర్ విగ్రహానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మినీ మహానాడులో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందన్నారు. పేదల సంక్షేమం ఒకవైపు రాష్ట్ర అభివృద్ధి మరో వైపు తనదైన ముద్ర వేస్తుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలపడటానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ కలి శెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా టిడిపి నిలిచిందన్నారు. మాజీ ఎంపిపి మక్కువ శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన మినీ మహానాడులో జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు రామారావు

కార్మికవర్గ నిరసనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా చేపడుతున్న కార్మికవర్గం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద దేశవ్యాప్త సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఈ నెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె జులై 9కి వాయిదా పడిందని ఆరోజు సమ్మె జయప్రదం చేయడానికి ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. స్థానిక మొయిద జంక్షన్‌లో ఉదయం 9గంటలకు నిరసన కార్యక్రమం జరుగుతుందని కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బిజెపి తెచ్చిన కోడ్‌లు కార్పొరేట్ల ప్రయోజనం చేకూర్చు కోసం కార్మిక వర్గం సంఘాలు పెట్టుకోకుండా హక్కు లను కాలరాస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జరజాపుపేటలో జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1996-97 పదవ తరగతి బ్యాచ్ కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ బ్యాచ్ వారు కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రయివేట్ రంగాల్లో స్థిర పడ్డారు. కొంతమంది గృహిణులుగా భాద్యతలు నిర్వర్తిస్తున్నారు. వారు చదువుకున్న రోజుల్లో అనుభవాలను నెమరు వేసుకొని సామాజిక సేవలు చేయడానికి నిర్ణయించుకున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం ఉన్నత పాఠశాలలో గత వారం రోజుల నుంచి జరుగుతున్న భోగాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్ స్పాన్సర్ చేసిన జట్టు మొదటి స్థానంలో నిలవగా, తెలుగుదేశం పార్టీ భోగాపురం గ్రామ అధ్యక్షులు బొడ్డ నర్సింగరావు స్పాన్సర్ చేసిన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ టోర్నమెంట్‌కు స్పాన్సర్‌గా నిలిచిన తెరపల్లుకుల శ్రీకృష్ణ జూనియర్, డిగ్రీ కళాశాల చైర్మన్ బొడ్డ నర్సింగరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న కనకరాజు, వదుపుల గిరి, కాపుగంటి శ్రీనివాసరావు, బొల్లు త్రినాథ్ తమవంతు సహాయం అందజేశారు. పల్లంట్ల జగదీష్, సుందర హరీష్, పళ్ల రాంబాబు, బొద్ద హరిబాబు, మాత నవీన్, సుందర వెంకటేష్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న గ్రామాలు

- పారిశుధ్య నిర్వహణ లోపంతో అవస్థలు
- దోమలకు నిలయాలుగా మారిన కాలువలు
- నామమాత్రంగానే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని 34 పంచాతీలు, వాటి మధుర గ్రామాలు కంపుకోడుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వేచ్ఛ ఆంధ్ర - స్వేచ్ఛ దివాస్ కార్యక్రమం పేరుతో గ్రామాల అభివృద్ధి చేస్తున్నామని అధికారులు గొప్పలు చెప్పుకుంటున్న వాటికి భిన్నంగా గ్రామాల్లో పరిస్థితి కనిపిస్తోంది. పల్లెలను అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం పలు ప్రకటనలు జారీ చేస్తున్నప్పటికీ కనీసం మురుగు కాలువలను కూడా శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామాలను పట్టించుకోకపోవడంతో అపారిశుధ్యం విళయతాండవం చేస్తుందని తద్వారా దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు

మండలంలోని మండవకురిటి, సంతకవిటి, ఎంఆర్ అగ్రహారం వంటి చాలా గ్రామాల్లో కాలువల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాలను ఏళ్లుగా తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెందడంతో పాటు రాత్రి వేళల్లో మురుగు దుర్వాసనకు నిద్ర పట్టడం లేదని వృద్ధులు, చిన్నారులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి విష జ్వరాల వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


ఎంఆర్ అగ్రహారం వద్ద నాచుగా మారిన మురుగు

చినుకుపడితే మురుగు మయం

ఏళ్లుగా కాలువల్లో చెత్త, మురుగు తొలగించకపోవడం వల్ల గ్రామాల్లో చినుకు పడితే చాలు కాలువలలోని మురుగు నీరు రోడ్డు పై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలలోని మురుగు రోడ్లు పైకి రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఈ మురుగు దోమలకు నిలయంగా మారాయని చెబుతున్నారు.

అధ్వానంగా మండవకురిటి కాలువలు

మండలంలోని మండవకురిటి గ్రామంలో కాలువలు దారుణంగా తయారయ్యాయి. కనీసం శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారా, లేదా అనే అనుమానం వచ్చేలా కాలువలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో చెత్త, చెదారంతోపాటు ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో దోమలకు నిలయాలుగా మారాయి. రానున్న వర్ష కాలంలో విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయపడుతుఆన్నరు. ఈ దోమలకు భయపడి రాత్రి వేళల్లో దోమల మందులతో పాటు, దోమ తెరలు ఉపయోగిస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కనీసం సచివాలయ సిబ్బంది చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామ పరిశుభ్రత గూర్చి పంచాయతీ అధికారులకు సంబంధం లేనట్టుగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మండల స్థాయి అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గతంలో రెడ్ జోన్‌గా ప్రకటించినా..?

దోమలకు అడ్డాగా ఎంఆర్ అగ్రహారం మురుగు కాలువలు మారాయి. చాలా కాలంగా మరుగు తొలగించకపోవడంతో మొత్తం నాచులా తయారై ఉంది. మురుగు కాలువల వల్లే గతంలో ఈ గ్రామం విష జ్వరాల బారిన పడడంతో రెడ్ జోన్‌గా ప్రకటించారు. జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఈ గ్రామం వైపే చూసింది. కొందరు విషజ్వరాల బారిన పడి మృతి చెందారు. చాలా మంది కనీసం నడవలేని పరిస్థితి ఉండేది. ఇంత దారుణం జరిగినా పంచాయతీ అధికారులు మాత్రం కాలువలను శుభ్రం చేయడం లేదు. గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ అధికారులకి తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.


మండవ కురిటి వద్ద కాలువ పరిస్థితి

మండల కేంద్రంలోనూ అదే పరిస్థితి

మండల కేంద్రంలోని కాలువలలో చెత్త పేరుకుపోవడంతో, మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండడం ప్రజలు దోమలతో దండయాత్ర చేస్తున్నారు. ఒక పక్క విద్యుత్ కోతలు... మరో పక్క దోమలతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. నెలలు తరబడి కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు కంపు కొడుతోందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గ్రామ సచివాలయం పక్కన మురుగు నీటిలో పందులు హల్ చల్ చేస్తున్నాయని, కనీసం సచివాలయ సిబ్బంది చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని తక్షణమే మండల అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. గరికిపాడు గ్రామంలోని సచివాలయ సమీపంలోని కాలువను కలుపు మొక్కలతో నిండిపోయింది. కనీసం సచివాలయ సిబ్బందికి పట్టడం లేదు. తలాడ, బొద్దూరు, గుళ్ళసీతారామపురం గ్రామాలలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు కాలువలు నిర్మాణం సరిగ్గా లేదు. ఇంటింటి కుళాయి నీరు రోడ్డు పైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోళ్ళవలస, తమరాం, వాసుదేవపట్నం, పిజెపేట, కొండగూడెం, మోదుగులపేట, గోవిందపురం గ్రామాల్లో కాలువలు శుభ్రం చెయ్యాల్సి ఉంది. ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మంతిన, మల్లయ్యపేట, రామరాయపురం, అప్పలగ్రహారం గ్రామాల్లో కాలువలను శుభ్రం చెయ్యడంలేదు. దీంతో మురుగు నీరు నిల్వ ఉండటంతో పంచాయతీ అధికారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు సంజీవని సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి - బొబ్బిలి


బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పేదలకు సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం చేస్తుందని బేబినాయన అన్నారు. బొబ్బిలి మండలం జగన్నాధపురానికి చెందిన పి.గణపతికి రూ.5,72,573, మున్సిపాలిటీలోని ఆరో వార్డుకు చెందిన కె.విజయలక్ష్మికు రూ.2లక్షలు, కె.పద్మావతికి రూ.50వేలు, స్వామివారివీధికి చెందిన జగదీష్‌కు రూ.2లక్షలు, రామభద్రపురం మండలం జన్నివలసకు చెందిన గణేష్‌కు రూ.95,165 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మ నాయుడు చేతులు మీదుగా ఆదివారం అందించారు. ముగడ గ్రామానికి చెందిన మత్స వేణమ్మకి రూ.1,70,417, తెర్లాం మండలం వెలగవలసకు చెందిన మహంతి శాంతికి రూ1,48,799, బాడంగి మండలం, అల్లుపాల్తేరుకు చెందిన అల్లు అరుణకి రూ.65,983 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, మాజీ ఎంపిపి బొంతు త్రినాథ, వైస్ ఎంపిపి భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- కూతురిపైనే అనుమానం
- విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో అదే గ్రామానికి చెందిన యెర్ర ప్రగడ వెంకటలక్ష్మి (38) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటలక్ష్మి కూతురు రుచిత (18) రెండు సంత్సరాలుగా అదే గ్రామానికి చెందిన జెసిబి డ్రైవర్ హరికృష్ణను ప్రేమిస్తుంది. అతనినే పెళ్లి చేసుకుంటానని తన తల్లి వెంకటలక్ష్మికి రుచిత గతంలో తెలపగా తల్లి నిరాకరించింది. పైగా ఎస్‌కోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో హరికృష్ణపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆ కేసు నుండి బెయిల్‌పై బయటకు వచ్చిన హరికృష్ణను పెళ్లి చేసుకుంటానని, తనకు 18 ఏళ్లు నిండిపోయాయని రుచిత ఒత్తిడి చేసింది. అందుకు తల్లి వెంకటలక్ష్మి నిరాకరించగా తమ పెళ్లికి అడ్డుగా ఉన్న తల్లిని హతమార్చాలని తన ప్రియుడు హరికృష్ణతో కలిసి పథకం ప్రకారం శనివారం రాత్రి సుమారు పది గంటల సమయంలో బహిర్భూమికి అని చెప్పి తన తల్లిని ఊరి చివరనున్న నూతి వద్దకి తీసుకుని వెళ్లి అక్కడ ముందుగా అనుకున్న ప్రకారం తన ప్రియుడుతో పాటు మరో ఇద్దరు అతని స్నేహితులతో కలిపి తల్లి వెంకటలక్ష్మిని గొంతు కోసి బావిలో పడేశారు. చనిపోయిందని నిర్ధారించుకుని ఏమి తెలియనట్టు ఇంటికి వచ్చి ఎవరో కొంతమంది ఆటోలో వచ్చి తన తల్లి వెంకటలక్ష్మిని ఎత్తు కెళ్ళి పోయారని తన అన్నా ఎర్ర ప్రగడ హరీష్‌కి తెలిపింది. వెంటనే గ్రామస్తులతో వెళ్లి రాత్రంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం పోలీసులు రంగ ప్రవేశం చేసి అనుమానం వచ్చి కూతురు రుచితను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ప్రశ్నించారు. మరో పక్క వెంకటలక్ష్మీ శవాన్ని ఎక్కడ మాయం చేసారో అని చుట్టు పక్కల ప్రాంతాలు వెతకగా మధ్యాహ్న సమయానికి వెంకటరమణపేట గ్రామ ప్రధాన రహదారి సమీపంలో నెల బావిలో శవమై తేలిందని తెలిపారు. ఈ విషయంపై సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా మృతురాలు వెంకటలక్ష్మి కుమారుడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించామని, ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి, వారిని గుర్తించడానికి చర్యలు చేపట్టామని తెలిపారు.


వెంకటలక్ష్మి(ఫైల్)

చెరువు గట్టే శ్మశానం

- సింగరాయి దళితుల ఆఖరి మజిలీకి కష్టాలు
- ఎస్‌సిల పట్ల ప్రభుత్వాలు చూపించేది కపట ప్రేమేనా ?

ప్రజాశక్తి- వేపాడ

కోట్ల రూపాయల కలిగిన ఐశ్వర్యవంతుడైన.. కటిక నిరుపేదైనా.. ఊరికి రాజైన.. రోజువారి కూలీ అయిన అంతిమంగా కలిసి పోయేది మట్టిలోనే.. పల్లకి ఎక్కేవాడైనా పల్లకి మోసేవాడైనా ఏ కులమైనా ఏ మతమైనా చివరికి చేరేది మరు భూమికే.. కానీ అదే మరుభూమి లేక అంత్యక్రియలకు స్థలం కానరాక తమ ఆత్మీయుల్ని సగౌరవంగా సాగనంపే దారి కనిపించక సింగరాయి గ్రామ దళిత కుటుంబాల వారు పడుతున్న వేదన వర్ణనాతీతం. సరైన శ్మశానం లేక చెరువు గట్టుపైనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితిలు దాపురించాయి..

మండలంలోని సింగరాయి గ్రామంలో సుమారు 60 దళిత సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ఏ ఒక్కరు మరణించినా గ్రామానికి దూరంలో గల ఊర చెరువులో దహన సంస్కారాలు చేపట్టాలి. కానీ వర్షానికి చెరువు నిండిపోతే శవాన్ని గట్టుపైనే పాతి పెట్టాలి. ఎండాకాలంలో అయితే చెరువులో నీరు ఉండదు. దహన సంస్కారాలకు కిలోమీటర్ దూరం వెళ్లి పంట పొలంలో ఉన్న సేద్యపు బావి నుండి కుండతో కనీసం నాలుగు ఐదు సార్లు తిరిగి నీరు తెచ్చుకోవలసిన పరిస్థితి. ప్రభుత్వం ఎస్‌సిలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నమాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. ఎస్‌సిల శ్మశానం వద్ద కనీసం ఒక బోరు బావి, ఎండకు వానకు తలదాచుకోవడానికి ఒక షెడ్డుకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కి, అమరావతిలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల వేదికలో సామాజిక కార్యకర్తగా రిక్కీ అప్పారావు దరఖాస్తు ఇచ్చి నేటికీ సుమారు 8 నెలల కావస్తున్నా ఏ విధమైన చర్యలూ లేవు. పల్లె పండగలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల ద్వారా నాయకుల కల్లాలకు, పొలాలకు రోడ్లు నిర్మించి ప్రజాధనం వృధా చేస్తున్నారే గాని సింగరాయి గ్రామ దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించి ప్రహరీ, షెడ్డు, చేతి బోరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంపై దళితులపై నాయకులకు ఉన్న చిన్నచూపు తేటతెల్లమవుతుంది.


ఈ చెరువు గట్టే శ్మశానం

అంత అవసరమైతే మీ ఎమ్మెల్యేను అడుక్కోండి

శ్మశాన వాటిక సౌకర్యాల కోసం ప్రతిపాదనలు వేసి అధికారులకు పంపించాం నిధులు మంజూరైతే పనులు చేస్తాం. మీకు శ్మశాన వాటిక అత్యవసరమైతే మీ ఎమ్మెల్యేని వెళ్లి అడుక్కోండి.

అలీ, పిఆర్ జెఇ వేపాడ మండలం.

దళితుల సమస్యల పట్ల అధికారుల తీరు సరైంది కాదు

ప్రజాధనంతో జీతం తీసుకుంటూ ప్రజలకు పనిచేయాల్సిన ఓ అధికారి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. ఈ విధంగా దిగువ స్థాయి అధికారులు వ్యవహరించడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. సింగరాయి గ్రామ దళితులకు శ్మశాన వాటికకు సరైన స్థలం కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించుకుంటే గ్రామ దళితులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

చల్లా జగన్ సిపిఎం మండల నాయకులు, వేపాడ

నక్కలు, కుక్కలు పీక్కుతింటున్నాయి.

వర్షాకాలంలో చెరువు నిండిపోతే చెరువు గట్టు మీదే ఒక పక్కగా శవాన్ని పాతిపెట్టాలి. శవాన్ని గట్టు అంచున పాతి పెట్టడం వల్ల గట్టు లోతు బ్యాలెన్స్ తప్పి కుక్కలు నక్కలు శవాన్ని పైకి తీసి పీక్కుతింటున్నాయి. దుర్వాసన భరించలేని విధంగా ఉండటం వల్ల ఆ గట్టు గుండా ప్రయాణించడం కష్టంగా మారుతోంది. దయచేసి దళితుల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి.

- జె. శ్రీను. ఎస్‌సి కాలనీకి సింగరాయి గ్రామం.

త్వరలోనే శ్మశాన వాటిక పనులు చేపడతాం

సింగరాయి గ్రామ దళితుల కోసం శ్మశాన వాటిక వద్ద మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయి. నిధులు మంజూరు అవ్వగానే పనులు చేపడతాం.

సిహెచ్ సూర్యనారాయణ, ఎంపిడిఒ, వేపాడ

అమర జవాన్ల త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి- మెంటాడ

దేశరక్షణలో అసువులు బాసిన వీరజవాన్ల త్యాగం మరువలేనిదని పలువురు కొనియాడారు. ఇటీవల భారత్-పాక్ దాడుల్లో అమరుడైన వీరజవాన్ మురళీ నాయక్ సహా కొన్నేళ్ల క్రితం జరిగిన దాడుల్లో వీర మరణం పొందిన మెంటాడ గ్రామానికి చెందిన జవాన్ మీసాల రామకృష్ణ, చైనాతో జరిగిన దాడుల్లో ప్రాణాలర్పించిన సంతోష్ బాబుకు నివాళిగా క్విక్ డోనర్ సర్వీస్ ప్రతినిధులు ఆదివారం మెంటాడలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులుపెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రక్తదాతలు అమరుల త్యాగాన్ని కొనియాడారు. రక్తదానం ఆవశ్యకతను వివరించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో కొల్లా భరత్ కుమార్, వాసు, శివాజీ, ప్రసాద్, చిరంజీవి, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతి కథలు చదవడం, చెప్పడం చేశామని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రాయింగ్ వేయడం, క్యారం బోర్డ్, చదరంగం ఇతర ఆటలాడుకున్నారన్నారు.

మాక్సివిజన్ కంటి ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి కంటోన్మెంట్

నగరంలోని మయూరి హోటల్ సమీపంలో మాక్సివిజన్ కంటి ఆస్పత్రిని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఆ సంస్థ చీఫ్ మెడికల్ డైరెక్టర్ చిలుకూరి శరత్ బాబుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ దేశంలో సుమారు 55 బ్రాంచులతో తమ సంస్థ నడుస్తోందన్నారు. ఇప్పుడు విజయనగరంలో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో అన్ని రకాల కంటి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాక్సివిజన్ సీనియర్ జనరల్ మేనేజర్ ప్రదీప్ కుమార్, చిన్న పిల్లల డాక్టర్ ఎం.వెంకటేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.


కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి

నేడు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

బొబ్బిలి : బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరగనుంది. గత నెల 29న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై టిడిపి, వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారిగా ఆర్‌డిఒ రామ్మోహనరావును కలెక్టర్ నియమించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కొత్తవలస : మండలంలోని కొండడాబా ఆర్.సి.ఎం పాఠశాలకు చెందిన 2005-06లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకచోటకు చేరుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారంతా ఒకచోట ఉండి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. 25 ఏళ్ల తర్వాత విద్యార్థులను చూసిన ఆనందంలో ఒకరికొకరు తన్మయత్వంతో మునిగిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ తమ తమ కుటుంబ సభ్యులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేసుకున్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి తాగుతూ పట్టుబడిన వ్యక్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గంజాయి సేవిస్తూ పట్టు బడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నారాయణపట్నం బ్రిడ్జి దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతంలో ఒక వ్యక్తి అక్రమంగా గంజాయి కలిగి ఉండి సేవిస్తున్నాడని సమాచారంపై సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. జరజాపుపేటకు చెందిన యస్వంత్ అనే వ్యక్తి వద్ద 100 గ్రాముల గంజాయి, గంజాయి సేవించడానికి ఉపయోగించే పరికరాలను సీజ్ చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడు గత ఆరు ఏడు సంవత్సరాల నుంచి గంజాయి సేవిస్తున్నారని, ఒడిస్సా రాష్ట్రం రాయగడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో కొనుక్కుని ఇక్కడికి తీసుకొని వచ్చి సేవిస్తున్నానని విచారణలో చెప్పినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి సేవించినా వారి వద్ద గంజాయి కలిగి ఉన్న, ఏ రూపంలో గంజాయి సంబంధించి కార్యక్రమాల్లో పాలుపంచుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గంజాయి గురించి ఎవరికైనా తెలిస్తే 912110944 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడిలో ఎఎస్ఐ పి. దామోదర్ రావు, విఆర్ఒ వెంకటలక్ష్మి, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పాత్రపై విచారణ చేపట్టాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ముసిడిపల్లి పంచాయతీలో వెలసిన లే అవుట్ అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. ఆదివారం మండలంలోని ముసిడిపల్లి లేఅవుట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ లేఅవుట్‌కు వేసిన 60 అడుగుల దారిలో డి పట్టా భూములు, చెరువు భూములు, కలిపి నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేసారని వీటిపై చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వంలో ఉన్న అధికారుల నుంచి నేటి ప్రభుత్వంలోకి వచ్చిన అధికారుల వరకు పదేపదే కోరుతున్న ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇన్ని అక్రమాలు ఇక్కడ జరిగాయని మంత్రుల సమావేశంలో డిఆర్‌సి సమావేశంలో చర్చించినా అధికారుల్లో చలనం రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయాలకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని కొంతమంది ప్రజాప్రతినిధులు వీరికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుంటే రక్షించాల్సిన అధికారులు ఈ రకంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయాలపై గతంలోనే అప్పటి కలెక్టర్లు, ఆర్‌డిఒలకు పూర్తిస్థాయిలో వివరించామని మరోసారి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇక్కడకు తీసుకువచ్చి జరుగుతున్న అన్యాయాలను చూపిస్తామని చెప్పారు. ఈ అక్రమాలు అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయని అన్నారు. ఈ సమావేశంలో పలు పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఇండియన్ గ్యాస్ కొత్త పాయింట్ ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇండియన్ గ్యాస్‌కు సంబంధించిన కొత్త సర్వీస్ పాయింట్ కొత్తపేటలో ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత వాసులకు ఈ సర్వీస్ పాయింట్‌లో నిరంతరం గ్యాస్ సిలెండర్లు అందుబాటులో ఉంటాయి. కొత్తపేట, సీతారామునిపేట, గొర్లెపేట పంచాయతీలకు సంబంధించిన గ్రామాల వారు, ఆయా పంచాయతీ మధుర గ్రామాలైన అప్పయ్య పేట, సువ్వానిపేట, దీపిల్లిపేట, టొంపలపేట గ్రామాలకు చెందిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవచ్చును. ఈ సందర్భంగా నిర్వాహకులు కలిశెట్టి బాబూరావు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు సరిపడే సిలెండర్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గ్యాస్ సిలిండర్ వెంటనే బుక్ చేసి ఇవ్వడంతో పాటు, సబ్సిడీ అమౌంట్ పడకపోయినా చెక్ చేసి వివరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు తన నెంబరు 9603043212ను సంప్రదించాలన్నారు.